క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రీన్ డే



పెనమలూరు: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రీన్ డే ఘనంగా చేశారు, గోసాల, గంగూరు, వణుకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు గ్రీన్ దుస్తులు ధరించి వచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రీన్ రంగు పై అవగాహన కల్పించారు. గ్రీన్ బెలూన్స్ ఎగురవేశారు. గ్రీన్ రంగులో ఉండే ఆట వస్తువులు చిన్నారులకు ఇచ్చారు. అదే విధంగా గ్రీన్ రంగులో ఉన్న పండ్లు, మొక్కలు, రంగులు చూపారు. మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి రజత ఛత్రం బహూకరణ



కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వేంచేసి ఉన్న శ్రీ ధ్యాన యోగ సాయి మందిరంలో కొలువైన దత్తాత్రేయస్వామి వారికి కాలనీ వాసులు శ్రావణి, నిరంజన్ దంపతులు రూ.54 వేలు విలువైన రజత ఛత్రం శనివారం బహూకరించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆలయంలో విశేష పూజలు జరిపించారు. స్వామివారిని ఆరాధిస్తూ పూజలు చేయించారు. ఈ సందర్భంగా దాతలను నిర్వాహక ప్రతినిధులు సన్మానించారు.

భార్య పిల్లలు అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో భార్య ఇద్దరు పిల్లలు అదృశ్యమయిన ఘటన పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకిలో కోమటి రాంబాబు తన కుటుంబ సభ్యులతో అపార్టుమెంట్‌లో నివశిస్తున్నాడు. ఆటోనగర్‌లో పని చేస్తాడు. రాంబాబుకు భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే ఇల్లు కొనే విషయమై భార్య భర్తలకు మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య ఇద్దరు పిల్లలు శుక్రవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వారి కోసం విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో వెతికినా జాడ తెలియలేదు. దీంతో భర్త పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జతీయ రహదారిపై పెనమలూరు సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంకు చెందిన యార్లగడ్డ మురళీకృష్ణ పోరంకి సాలిపేటలో బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తాడు. పెనమలూరు నుంచి సాలిపేట వెళుతూ బందరు రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హాస్టల్ నిర్వాహకుడిపై దాడి

పెనమలూరు: కానూరులో హాస్టల్ నిర్వాహకుడిపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం .... కానూరు సాయిబాబా గుడి వద్ద గడ్డిపాటి ప్రణీత్‌చౌదరి కొన్నేళ్లుగా బాయ్స్ హాస్టల్ నడుపుతున్నాడు. హాస్టల్‌లో చేరటానికి ఖాదర్ అనే వ్యక్తి వచ్చి భోజనం చేశాడు. సొమ్ము చెల్లించకుండా ఖాదర్ వెళ్లాడు. దీంతో ప్రణీత్‌చౌదరి భోజనం చేసి సొమ్ము ఎందుకు చెల్లించలేదని ఫోన్ చేసి ఖాదర్‌ను అడిగాడు. తనకు హాస్టల్ నచ్చలేదని ఖాదర్ తెలిపాడు. తిన్న భోజనానికి సొమ్ము కట్టాలని అడుగగా ఖాదర్ మరి కొందరితో వచ్చి సొమ్ము అడుగుతావా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రణీత్‌చౌదరి, హాస్టల్‌లో పని చేసే వారి పై దాడి చేశాడు. ఈ ఘటన పై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఉంగుటూరు: సొంత భూమి కలిగిన రైతులందరు రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యసాయాశాఖ అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. సొంత భూమి కలిగిన రైతులు తమ భూ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో తెలియజేసి ఓటీపీ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ వలన ప్రభుత్వం ఆధార్ నంబరులాగా ఒక ఫార్మర్ యూనిక్ నంబరు కేటాయిస్తోందని చెప్పారు. ఇతర రాష్ట్రాలు, జిల్లా, గ్రామాల్లో ఎక్కడ ఉన్న ఒకే నంబరు కిందకు వస్తాయని పేర్కొన్నారు. పథకాలు, రాయితీపై విత్తనాలు, పరికరాలు పొందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు.

ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు

- కొనుగోళ్లు నిలిపివేసిన ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు
- కల్లాల్లోనే ధాన్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరుగాలం చెమటోర్చి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతకు ఇబ్బందులు తప్పటం లేదు. బాపులపాడు మండలంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఈ సీజన్‌లో అమలు చేస్తున్న నూతన విధానం రైతులకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. రైతులు తమకు నచ్చినా ఏ రైస్ మిల్లుకైనా ధాన్యం తరలించవచ్చనే విధానం తీసుకురావటంతో ఆయా రైస్ మిల్లులకు పౌరసరఫరాల సంస్థ కేటాయించిన టార్గెట్లు పూర్తి కావటంతో సమస్య ఏర్పడింది. దీనికి తోడు అరకొరగానే ధాన్యం కొనుగోళ్లకు రైస్‌మిల్లర్లకు టార్గెట్లు ఇవ్వటం కూడా ఇబ్బందికరంగా మారింది.

అంతంతమాత్రంగానే అనుమతి....

బాపులపాడు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 16,480 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. సగటున ఎకరాకు 40 బస్తాలు (75 కేజీలు) చొప్పున రైతులు దిగుబడి సాధించారు. దీని బట్టి మండలంలో దాదాపుగా 50 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం పండింది. కానీ పౌరసరఫరాల సంస్థ బాపులపాడు మండలంలో ఇప్పటికి కేవలం 21,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది. దీంతో దాదాపు సగానికిపైగా ధాన్యం ఇంకా పొలాల్లో కల్లాల్లోనే మిగిలిపోయింది. రబీ సీజన్‌లో మినుము సాగు చేసేందుకు రైతులు సాధారణంగా పంట పొలాల్లో వరి కుప్పలు వేస్తారు. ఇప్పుడు ధాన్యం కొనే నాధుడు లేకపోవటంతో ఆ కుప్పలు తీసేందుకు సంకోచిస్తున్నారు. మరో వారం, పదిరోజుల్లో మినుము తీతలు కూడా మొదలయ్యే అవకాశం ఉండటంతో కల్లాల్లో ఉన్న వరికుప్పలను ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో రైతాంగం ఉన్నారు. మండలంలో 27 రైస్ మిల్లులు ఉండగా, టీడీపీ నాయకులుగా చెలామణిలో ఉన్న కొన్ని రైస్‌మిల్లర్లకు మాత్రమే అధికంగా ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నారు.



కానుమోలులో పొలాల్లోని వరికుప్పలు



కాకులపాడులో కల్లాలోనే మిగిలిన ధాన్యం

బాపులపాడు మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు సగటున ఎకరాకు 35 నుంచి 45 బస్తాలు (75 కేజీలు) వరకు దిగుబడి

ఎకరాకు గరిష్ట పరిమితితోనూ ఇబ్బందులు....

వచ్చింది. కానీ ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు గరిష్ఠంగా 3 మెట్రిక్ టన్నుల చొప్పున 40 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పటంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ మిగిలిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

కొనుగోళ్లకు ఇబ్బందులు లేవు



బాపులపాడు మండలంలోని 21,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా, మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కేవలం 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. కానీ కొన్ని రైస్ మిల్లర్లుకు పౌరసరఫరాల సంస్థ కేటాయించిన టార్గెట్లు పూర్తి కావటంతో ఆయా మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించేందుకు అవకాశం లేదు. మిగిలిన రైస్ మిల్లులకు ఆ రైతులు యథావిధిగా ధాన్యం అమ్ముకోవచ్చు.

– జొన్నలగడ్డ భవాని, ఏవో, బాపులపాడు

ప్రభుత్వ తీరుతో రైతులకు ఇక్కట్లు



బాపులపాడు మండలంలోని దాదాపు 50 శాతంపైగా ధాన్యం ఇంకా కుప్పల్లోనే ఉంది. కానీ ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని రైస్ మిల్లులకు టార్గెట్లు పూర్తికావటంతో ఈ సమస్య వచ్చినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

– పదకల శ్రీనివాసరావు, రైతు, కాకులపాడు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న టి. ఉమారాణి తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురును ఆలోజింపజేసింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టి పలు నమూనాలు ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, మానవ అవయవాల పనితీరు, ట్రాన్స్‌పోర్టు విధానం, అడవుల ప్రాముఖ్యత, సౌరశక్తి, రైతుల గొప్పతనం, గుణదల మాత, పోతులూరి వీరబ్రహ్మం చరిత్ర, హైడ్రో ఎలక్ట్రిసిటీ, మ్యాక్స్ పజిల్స్ వంటి ఎగ్జిబిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ ఇన్‌చార్జి టి. ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పరిశోధనాత్మక దృష్టి అలవరుచుకోవాలని సూచించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చునన్నారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్లను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మవాణి, స్థానిక నాయకులు అడ్డెపల్లి సాంబశివనాగరాజు, కొండ, ఇన్‌చార్జిలు దుర్గ, కీర్తి, వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరమ్మతల్లికి దీపశోభ

- వైభవంగా ప్రారంభమైన ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల
- ఎదురుగండ దీపాలతో తల్లికి హారతులుపట్టిన భక్తజనం
- పసుపు కుంకుమలు సమర్పించిన పోలీసుశాఖ
- 15 రోజులపాటు కొనసాగనున్న తిరునాళ్ల మహోత్సవాలు



ఉత్సవాల ప్రారంభానికి భారీగా హాజరైన భక్త జన సందోహం (ఇన్‌సెట్లో) అమ్మవారి రథం ఊరేగింపు

ఉయ్యూరు: మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి)ని పురస్కరించుకుని ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లికి అశేష భక్తజనం హారతులు పట్టింది. అమ్మా వీరమ్మతల్లీ.. భక్తుల పాలిట కల్పవల్లి.. జై వీరమ్మ.. జైజై వీరమ్మ.. అంటూ సాగిన భక్తుల శరణఘోష నడుమ మెట్టినింటి నుంచి శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి భక్తుల పూజలందుకున్నారు. 15 రోజులు పాటు సాగే ఈ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. సంప్రదాయం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ విశ్వనాథ్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మేళతాళాలతో పోలీసుస్టేషన్ నుంచి పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా రావిచెట్టు సెంటరు మీదుగా తల్లి మెట్టినింటికి చేరుకున్నారు. అనంతరం కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారికి తొలి పూజ నిర్వహించి చలువకావిడి, పసుపు కుంకుమలు సమర్పించారు. డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, సీఐ రామారావు అమ్మవారిని దర్శించుకున్నారు. పారుపూడి, నెరుసు వంశస్తులు ఆచార సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆ వంశస్తులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మెట్టినింటిలో కొలువుదీరిన శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం విగ్రహాలను మెట్టి నింటి నుంచి మోసుకువచ్చి పల్లకిలో కూర్చోబెట్టి తిరునాళ్ల మహోత్సవానికి శ్రీకారం చుట్టారు.



దీపాలతో అమ్మవారికి స్వాగతం

దీపకాంతులతో ఉయ్యూరు ధగధగ

మెట్టినింటి నుంచి బయలుదేరిన వీరమ్మతల్లి అమ్మవారికి భక్తులు ఎదురుగండ దీపాలతో హారతులు పట్టి స్వాగతం పలికారు. మెట్టినింటి పరిసరాలు, రావిచెట్టు రోడ్డు, ప్రధాన సెంటరు, కాటూరు రోడ్డు, భక్తులతో కిక్కిరిశాయి. ఉపవాస దీక్షతో అమ్మవారికి ఎదురుగండ, తిరుగుడు గండ దీపాలు సమర్పించిన భక్తులతో ఉయ్యూరు పట్టణం జనసంద్రంగా మారింది. భక్తులు సమర్పించిన దీపకాంతులతో పట్టణం శోభాయమానంగా దర్శనమిచ్చింది.

వీరమ్మతల్లీ.. చల్లంగ చూడమ్మా..

పల్లకిలో ఊరేగుతున్న అమ్మవారికి భక్తులు దారిపొడవునా పసుపునీళ్లు ఓరబోసి భక్తిపారవశ్యం చెందారు. తిరుగుడు గండ దీప భక్తులు అమ్మవారి పల్లకి వెంటరాగా అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తజనానికి పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహించి తరించారు. శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్, మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



ఎదురుగండ దీపాలతో అమ్మవారికి స్వాగతం పలుకుతున్న మహిళలు

నేడు ఊయల ఉత్సవం

ప్రధాన సెంటరులోని ఊయల స్తంభాల వద్ద అమ్మవారి ఊయల ఉత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. మెట్టినింటి నుంచి శనివారం రాత్రి బయలుదేరిన అమ్మవారు ఆదివారం గ్రామోత్సవం పూర్తి చేసుకుని ఊయల స్తంభం వద్దకు చేరుకుంటారు. ఊయల ఉత్సవం అనంతరం ఆలయ ప్రవేశం చేసి భక్తుల నుంచి పూజలందుకుంటారు. ఊయల ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు.



తొలిపూజకు పసుపు కుంకుమలు సమర్పించేందుకు బయలుదేరి వెళ్తున్న ఉయ్యూరు పట్టణ ఎస్‌ఐ విశ్వనాథ్

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వస్వామి దేవాలయ భూమిపూజ

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో నూతనంగా నిర్మించనున్న పద్మావతి అలివేలు మంగ సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం భూమిపూజ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పండితులు నాగమణికంఠశివచారి బృందంచే గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, వాస్తుపూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, రాజులపాటి శ్రీనివాసరావు (ఆర్ఎస్), మరీదు రాంబాబు మరో తొమ్మిది మంది దంపతులచే వాస్తు హోమం, మూతమంత్ర, మహా సుదర్శన, నరసింహ, శ్రీనివాస హోమాలు నిర్వహించారు. అనంతరం మహాపూర్ణహోతిని సమర్పించారు. వృషభరాజులకు పూజలు తర్వాత భూమాతను నీటితో శుద్ధిచేసి పసుపుకుంకుమ సమర్పించారు. సుముహూర్తమైన ఉదయం 11.28 గంటలకు దేవాలయ నిర్మాణ ప్రాంతాన్ని నాగలితో మూడు సార్లు దున్ని నవధాన్యాలను జల్లారు. వారం, పది రోజుల తర్వాత ధాన్యాలు మొలకలు వచ్చిన తర్వాత గోవుకు తినిపించడం ద్వారా వాస్తుదోషాలు పూర్తిగా తొలగనున్నాయని శివచారి తెలిపారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పొట్లూరి బసవరావు సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు ఆలయ కమిటీ తెలిపింది. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీటీసీ సభ్యులు శౌంరి కిషోర్, వార్డు సభ్యులు యర్రగాని రత్తయ్య, చలపాటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వృషభరాజులకు పూజలు చేస్తున్న పలువురు దంపతులు

యోగాతో మానసిక ఒత్తిడి నివారణ

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అలవర్చుకోవాలని డాక్టర్ సీహెచ్ హామీని తెలిపారు. నున్న గ్రామంలోని వికాస్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ కళాశాలలో మానసిక వైద్యశాల వింహాన్స్ వారి సౌజన్యంతో విద్యార్థులకు మానసిక ధృడత్వంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సీహెచ్ హామీని మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా చేయాలని సూచించారు. ఎక్స్‌ర్‌సైజులు చేయాలని, ముఖ్యంగా మొబైల్ వాడకాన్ని, స్క్రీన్ చూడటం తగ్గించుకోవాలని చెప్పారు. రెసిడెంట్ సైక్రియాటిస్ట్ డాక్టర్ పి.మార్టిన్‌రాజ్, సైకాలజిస్ట్ మెంబర్ వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ఎలా సిద్ధంకావాలో ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.గోపాలకృష్ణ, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ హామీని

పోరంకి రామాలయానికి భారీ విరాళాలు



పెనమలూరు: పోరంకి గ్రామంలో పునర్నిర్మాణం చేసిన సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత కోదండరామస్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీ విరాళాలు ఇచ్చారు. గ్రామానికి చెందిన కర్లపూడి రంగారావు భార్య లలితమ్మ రూ.5,00,001 విరాళం ఇచ్చారు. రామినేని సుబ్బారావు భార్య నాగశిరోమణి జ్ఞాపకార్థం రూ. 5,00,001 విరాళం, దొండపాటి రాంబాబు, భార్య శ్రీదేవి రూ.1,01,116 విరాళం, ఎ.రామకృష్ణ, భార్య పద్మకుమారి రూ.1,01,116 విరాళం ఆలయ కమిటీకి అందచేశారు. ఈ నెల 13వ తేదీన స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షిక వేడుకలు

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం వార్షిక వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో సాయినాధుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయినామ సంకీర్తన, భక్తిగీతాలాపనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహక ప్రతినిధులు పర్యవేక్షించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గోదా రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు రెండవ రోజు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై భీష్మ ఏకాదశి విశిష్టతను వేద పండితులు వివరించారు. ఆరాధన, తీర్థగోష్ఠి అనంతరం మూలవర్లకు పంచామృత స్నపనము, అలంకారముల అనంతరం హంస వాహనంపై స్వామివారు గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. యాగశాలలో కల్యాణోత్సవాంగ హోమాలు, గ్రామ బలిహరణ జరిగింది. సాయంత్రం శేషవాహనోత్సవం తరువాత వేదపండితులు తీర్థగోష్ఠిలో పాల్గొన్నారు. పెద ముత్తేవి పీఠాధిపతి కృష్ణ స్వామీజీ ఆధ్వర్యంలో కోసూరు కృష్ణమాచార్యులు యాజ్ఞిక పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వేణుగోపాలస్వామి

వికాస్ కాలేజీలో స్టూడెంట్ ఫోరమ్ ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ స్టూడెంట్ ఫోరమ్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.సూర్యప్రసాద్‌రావు, ఐఈటీఈ విజయవాడ సెంటర్ చైర్మన్, సెక్రటరీ డాక్టర్ ఎస్‌కె రియాజుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, ఫ్యాకల్టీకి ఉపయోగపడే అనేక రకాల సెమినార్లు, వర్కుషాపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల నిర్వహణతో పలు ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అకడమిక్ డైరెక్టర్ ఎన్.కీర్తి, ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, డీన్ సెవుగరాజన్, హెచ్ఓడి వెంకటేశ్వరెడ్డి, ఐఎస్ఎఫ్ కోఆర్డినేటర్ డి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.